సాక్షి
నిర్మల్

శనివారం । 18 । మే । 2024



'గుండేగాం' కష్టం తీరేదెప్పుడో!
గుండేగాం ముంపు సమస్యకు పాలకులు ఇప్పటికీ పరిష్కారం చూపడంలేదు. వానాకాలం వస్తుందంటే భయంతో వణికిపోవాల్సిన పరిస్థితి. 8లో▸



రోడ్లపైనే ధాన్యం కుప్పలు
ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంటను ఆరబెట్టేందుకు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.6 /27.5
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా రైతులకు సరిపడా టార్పాలిన్‌లు, ధాన్యం సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలు ఏరోజుకరోజు ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్‌వో శ్రీకళ, సివిల్ సప్లయిస్ డీఎం నందిత, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, డీసీవో నర్సయ్య, ఏడీ మార్కెటింగ్ అష్పక, అధికారులు పాల్గొన్నారు.

సదర్‌మాట్‌ను సందర్శించిన సీపీఎం నాయకులు



సదర్‌మాట్ బ్యారేజిపై సీపీఎం నాయకులు

మామడ: మండలంలోని పొనకల్ గ్రామ సమీపంలో గోదావరిపై నిర్మిస్తున్న సదర్‌మాట్ మినీ బ్యారేజీని సీపీఎం జిల్లా బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడుతూ.. సదర్‌మాట్ బ్యారేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో పనులు ప్రారంభమైనా పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సదర్‌మాట్‌ను సందర్శించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డాకుర్ తిరుపతి, నాయకులు నాగెల్లి నర్సయ్య, సుంచుల నారాయణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి శిక్షణలో జిల్లా తపస్ నేతలు



శిక్షణ లో పాల్గొన్న తపస్ నాయకులు

నిర్మల్‌ఖిల్లా: హైదరాబాద్‌లోని శ్రీనీలకంఠ విద్యాపీఠంలో ఈనెల 16, 17 తేదీల్లో జరిగిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్రస్థాయి అభ్యాసవర్గంలో జిల్లాకు చెందిన పలువురు జిల్లాశాఖ సంఘ బాధ్యులు పాల్గొన్నారు. సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర, విద్య ఆధారంగా జాతి నిర్మాణం, దేశభక్తి, నూతన జాతీయ విద్యావిధానం, ఆదర్శ ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర వంటి పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని తపస్ నాయకులు పేర్కొన్నారు. ఇందులో జిల్లా బాధ్యులు టి.నవీన్‌కుమార్ జి.రాజేశ్వర్, అజయ్, ఆర్.రాజేశ్వర్, విఠల్‌రెడ్డి, దత్తురాం పటేల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

భైంసాటౌన్: వైద్య విద్యార్థులు తమ సేవల ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విశ్వ ఆయుర్వేద పరిషత్, తెలంగాణ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవినాయక్ అన్నారు. పట్టణ శివారులోని ఆరాధన ఆయుర్వేద వెల్‌నెస్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ×ఆయుర్వేద కౌశలం-2024‡ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఐదురోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి వైద్య విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభించి ఆయన మాట్లాడారు. వైద్యవిద్య అభ్యసించే విద్యార్థులు ఆయుర్వేద కేంద్రంలో అందిస్తున్న పంచకర్మ పద్ధతులు, వాటి ప్రయోజనాలను పరిశీలించి తెలుసుకోవాలన్నారు. తద్వారా ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యత జనాల్లోకి తీసుకెళ్లాలన్నారు. విశ్వ ఆయుర్వేద పరిషత్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ సారంగపాణి మాట్లాడుతూ భారతదేశం ఆయుర్వేదానికి పుట్టినిల్లు అన్నారు. వైద్య విద్యార్థులు ఆయుర్వేద వైద్యం ప్రయోజనాలు తెలుసుకోవాలని సూచించారు. ఆరాధన ఆయుర్వేద కేంద్రం చైర్మన్ డాక్టర్‌ద రాజారెడ్డి, వీపీపీ సభ్యులు డాక్టర్ కిషన్, డాక్టర్ సురేశ్, వివిధ రాష్ట్రాల వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవర్ డోస్!



- మోతాదు మించుతున్న మందులు
- అవసరం లేకున్నా యాంటీబయాటిక్స్
- ప్రాణాల మీదుకు తెస్తున్న స్టెరాయిడ్స్
- క్రమంగా పడిపోతున్న రోగనిరోధక శక్తి
- జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ, ఇతర బాధితులు
- అధికారుల తనిఖీల్లో షాకింగ్ విషయాలు

నిర్మల్: 'సార్.. రెండ్రోజుల నుంచి జరం పరేషాన్ చేస్తోంది. జర.. ఏవన్న మంచి గోలీలో.. ఇంజక్షన్లో ఇయ్యుండ్రి సార్..'అని పేషంట్ అనడమే అలస్యం .. జిల్లాలో చాలామంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, కొంతమంది వైద్యులు మోతాదుకు మించి మందులు ఇస్తున్నారు. దెబ్బకు జ్వరం ఒక్కరోజుకే తగ్గిపోతోంది. తొలిదశలోనే పేషెంట్ కోలుకోవాలన్న ఏకైక లక్ష్యంతో యాంటీబయాటిక్స్‌తోపాటు ఏకంగా స్టెరాయిడ్స్ ఇస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి షాకింగ్ విషయాలన్నీ నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ), తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్‌ఎంసీ)చేపడుతున్న తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో మోతాదుకు మించి మందులు ఇస్తున్న పరిస్థితిపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. మోతాదుకు మించి వాడుతున్న మందులతో జిల్లాలో ఎన్నడూ లేనంతగా కిడ్నీ సంబంధిత, ఇతర వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నట్లు గుర్తించారు.

ప్రమాదకరంగా..
జిల్లాలో ప్రధానంగా సరైన వైద్యఅవగాహన లేని ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అందిస్తున్న వైద్యం ప్రమాదకరంగా ఉందని మెడికల్ కౌన్సిల్ బాధ్యులే చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్త దాడుల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలో తనిఖీలు చేసిన సందర్భంలో చాలామంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, కొంతమంది వైద్యులు కూడా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఎక్కువగా ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. వీటి కారణంగా జిల్లాలో చాలామంది కిడ్నీ, ఇతర వ్యాధుల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు.

కేవలం అనుభవంతోనే..
అర్హత కలిగిన వైద్యులు తమ వద్దకు వచ్చే పేషెంట్లకు ఒక క్రమబద్ధమైన కోర్సును ఇచ్చి రోగం నయం చేస్తారు. వారు చదివిన చదువుతోపాటు అనుభవం, ప్రస్తుతం రోగి పరిస్థితిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకుంటూ వారు ట్రీట్‌మెంట్ కొనసాగిస్తుంటారు. ఏ మందులు ఇస్తే.. ఇప్పుడు ఏమవుతుంది, తర్వాత పేషెంట్‌పై దీని ప్రభావం ఎలా ఉంటుంది.. అనే విషయాలనూ వారు పరిగణనలోకి తీసుకుంటూ చికిత్స కొనసాగిస్తారు. మందులనూ అదే విధంగా ఇస్తుంటారు. కానీ.. కేవలం అనుభవం ఆధారంగా తెలిసిన వైద్యాన్ని ఆర్‌ఎంపీలు అందిస్తున్నారు. చాలామంది రేపొద్దున్న పేషెంట్ పరిస్థితి ఏంటన్న విషయాన్ని ఆలోచించడం లేదని, ప్రస్తుతం రోగాన్ని నయం చేయడమే చూస్తున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు.

రోగనిరోధకతకు దెబ్బ..
త్వరగా అనారోగ్యం, వ్యాధి నయం కావాలన్న తొందరలో అనుభవం/అర్హతలేని వైద్యులు, ఆర్‌ఎంపీలు ఏమేం మందులు ఇస్తున్నారో.. కూడా చాలామంది పేషెంట్లకు తెలియవు. అందులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ కూడా ఉంటున్నాయి. వీటిని తీసుకోవడం వల్ల సంబంధిత రోగం త్వరగానే నయమవుతుంది. కానీ.. వాటి ప్రభావం దీర్ఘకాలం భారీ నష్టాన్ని కలిగిస్తాయి. ప్రధానంగా మనిషి రోగనిరోధక శక్తిని తగ్గిస్తాయని వైద్యాధికారులు చెబుతున్నారు. కిడ్నీతోపాటు వివిధ అవయవాలపైనా తీవ్ర ప్రభావం చూపుతాయంటున్నారు. జిల్లాలో గురువారం చేసిన తనిఖీల్లో చాలామంది అర్హతలేని వాళ్ల ఇలాంటి యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు తమ తనిఖీల్లో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

ఏకంగా హాస్పిటల్సే..
జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఏకంగా ఆస్పత్రులను నడుపుతున్నట్లు మెడికల్ కౌన్సిల్ బాధ్యులు చెబుతున్నారు. కేవలం ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌గా ఉండాల్సిన చోట.. ఏకంగా బెడ్లు, మెడికల్, ల్యాబ్‌లతోసహా ఓ పెద్దాస్పత్రిలో ఉండే అన్నిసదుపాయాలు పెట్టి వైద్యం చేస్తున్నారని వెల్లడించారు. ఇదంతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని చెప్పారు. జిల్లాకేంద్రంలో పలువురు ఆర్‌ఎంపీలు కలిసి ఏకంగా ఆస్పత్రులు పెట్టడం గమనార్హం. అందులో ఒకదాంట్లో వైద్యులు లేనప్పుడు సదరు ఆర్‌ఎంపీలే చికిత్స ఇస్తున్నట్లు వెల్లడైంది. వీరికి ఓ వైద్యాధికారి అండ ఉందని మెడికల్ కౌన్సిల్ సభ్యులు పేర్కొనడం గమనార్హం.

అర్హతలు చూసి వెళ్లాలి..



పేషెంట్ గుడ్డిగా ఎవరిని నమ్మొద్దు. కచ్చితంగా వైద్యం చేయించుకునే ముందు సదరు వైద్యుడు అర్హత కలిగినవారా..లేదా.. చూసుకుని వెళ్లాలి. అర్హత లేకుండా వైద్యం చేయడం చట్టప్రకారం నేరం.
–డాక్టర్ మురళీధర్, అధ్యక్షుడు ఐఎంఏ నిర్మల్

ఇష్టారీతిన మందులు..



నిర్మల్ జిల్లాలో చేసిన తనిఖీల్లో చాలామంది ఆర్‌ఎంపీలు, కొంతమంది వైద్యులు ఇష్టారీతిన మోతాదుకు మించి మందులు ఇస్తున్నట్లు వెల్లడైంది. కొంతమంది యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తుండటం ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి వాటిపై తనిఖీలు కొనసాగిస్తాం. చర్యలనూ తీసుకునేలా చేస్తాం.
–డాక్టర్ శ్రీనివాస్‌యెగ్గన, టీఎస్‌ఎంసీ ఎథికల్ కమిటీ ఉమ్మడిజిల్లా చైర్మన్

ఆర్టీసీకి ఎలక్షన్ బొనాంజా..!

- 14న రికార్డుస్థాయిలో ఆదాయం
- నిర్మల్, భైంసా డిపోలకు రూ.60.72 లక్షలు

నిర్మల్, భైంసా డిపోలకు ఆదాయమిలా(రూ.లక్షల్లో...)

తేదీ	నిర్మల్	భైంసా
10	39.20	15.43
11	41.12	16.45
12	39.00	15.65
13	33.00	13.05
14	44.23	16.49

భైంసాటౌన్: ఓటర్లలో పెరిగిన చైతన్యంతో పోలింగ్ శాతం పెరగడమేకాదు.. ఆర్టీసీకి ఆదాయమూ గణనీయంగా తెచ్చిపెట్టింది. అదేంటి.. ఎన్నికలకు, ఆర్టీసీకి ఆదాయానికి సంబంధమేంటని అనుకుంటున్నారా.. అవును డి..! ఈనెల 13న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్, నిజామాబాద్, ఇతర ప్రాంతాల్లో వృత్తిరీత్యా వలస వెళ్లినవారు, ఉన్నత చదువుల కోసం వెళ్లిన యువత ఓటేసేందుకు స్వగ్రామాలకు చేరుకున్నారు. ఎన్నికల తేదీకి రెండు, మూడు రోజుల ముందే చేరుకోవడం, అనంతరం ఓటు హక్కును వినియోగించుకుని తిరుగు ప్రయాణం కావడంతో ఆర్టీసీకి ఎన్నికలు బంపర్ ఆదాయం తెచ్చిపెట్టింది. తిరుగు ప్రయాణం రోజైన 14న ఒక్కరోజే జిల్లా ఆర్టీసీకి రూ.60.72 లక్షల ఆదాయం సమకూరింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరడంతో సంస్థ ఎండీ సజ్జనార్ ఉద్యోగులందరికీ స్వీట్లు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో నిర్మల్, భైంసా డిపోల్లో ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రికార్డుస్థాయిలో ఆదాయం..
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లోని ఓటర్లు స్వగ్రామాలకు రావడం, తిరిగి 14న తిరుగు ప్రయాణం కావడంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరింది. 14వ తేదీ ఒక్కరోజే నిర్మల్ డిపోకు రూ.44.23 లక్షలు, భైంసా డిపోకు రూ.16.49 లక్షల ఆదాయం చేకూరింది. సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలియజేశాం.
– ప్రతిమారెడ్డి, డీఎం, నిర్మల్/భైంసా

ఆర్టీసీ ఉద్యోగులకు మిఠాయిలు పంపిణీ



ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు శుక్రవారం మిఠాయిలు పంచారు. ఈనె ల 14న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలకు కలిపి ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.24.23 కోట్ల ఆ దాయం సమకూరింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులందరికీ స్వీట్లు పంచాలని ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డీఎం ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత తెలిపారు. ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేసి సంస్థ ఆదాయం పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్‌ఎల్ చందు, సూపర్‌వైజర్స్ కేకే.రెడ్డి, గోపాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ క్రీడాకారిణికి ఆర్థికసాయం



పోటీలకు ఎంపికైన యువతి

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేత యువతి కార్కురి నాగలక్ష్మి జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తుంది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్ క్రీడాకారిణికి బాక్సింగ్ కిట్ కొనుగోలుకు కావాల్సిన రూ.10 వేలు అందజేశారు. ఈనెల 21న పుణెలో జరిగే పోటీల్లో ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులతోపాటు గ్రామానికి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



సత్కారం అందుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు


నిర్మల్‌ఖిల్లా: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూటీఎస్ కృషి చేస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. టెట్ తో సంబంధం లేకుండా ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే పదోన్నతులతో కూడిన బదిలీలు చేపడుతుందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీలోగా పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 50 శాతం ఫిట్మెంట్ ఇచ్చే విధంగా పీఆర్సీ కమిటీకి ప్రతిపాదన చేసినట్లు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు, మెరుగైన ఈహెచ్‌ఎస్ విధానం అమలు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వివరించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యావలంటీర్లు, స్కావెంజర్లు నియమించాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం ఏప్రిల్, మే నెలలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట నరేంద్రబాబు, రమణారావు, కార్యవర్గ సభ్యులు నరసయ్య, గంజారాం, శిరీష్, మారెన్న, భూమారెడ్డి, వెంకటరమణ శ్రీనివాస్, పరమేశ్వర్‌రెడ్డి, కొబ్బాయి శంకర్ సంజీవరావు, వెంకటేశ్వర్ లింగన్న, కృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, రాఘవేందర్ రజనీకాంత్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పాఠశాల పనులు పూర్తి చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నిర్మల్‌చైన్‌గేట్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఇతర అధికారులతో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, పెండింగ్ ధరణి దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తుల వివరాలు, వరి ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ సరఫరా ప్రక్రియ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు, మరమ్మతులు కొనసాగుతున్నాయని వివరించారు. జూన్ 5లోపు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించామని తెలిపారు. సీఎంఆర్ సరఫరాను వేగవంతం చేశామన్నారు. గడువులోపు ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పూర్తికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగ్‌రావ్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో పాఠశాలల పనులు పూర్తి చేయాలి



పీచరలో పాఠశాల పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

లక్ష్మణచాంద: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పీచర ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను శుక్రవారం పరిశీలించారు. జూన్ 5 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నిర్వహణకు గ్రామంలోని మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించి, చిన్నారులు, గర్భిణుల వివరాలు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. డీఈ వో రవీందర్‌రెడ్డి, పౌరసరఫరాల డీఎం శ్రీకళ, జిల్లా సహకార శాఖ అధికారి నర్సయ్య, ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ జానకి, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

సిరాల ఇలా.. సాగునీరెలా?

- గత వానాకాలంలో కొట్టుకుపోయిన ప్రాజెక్టు
- ఏడాది కావస్తున్నా మరమ్మతుకు నోచుకోని వైనం..
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- మరో 20 రోజుల్లో వర్షాలు ప్రారంభం
- ఆయకట్టుకు ఈసారి కూడా క్రాప్ హాలిడే?
- ఆందోళనలో అన్నదాతలు



తెగిపోయిన సిరాల ప్రాజెక్టు (ఫైల్)



సిరాలను పరిశీలించిన అప్పటి కలెక్టర్, ఎమ్మెల్యే(ఫైల్)



కొట్టుకుపోక ముందు సిరాల ప్రాజెక్టు(ఫైల్)

భైంసా: జిల్లాలోని చిన్ననీటి ప్రాజెక్టుల్లో ఒకటైన సిరాల.. ఈసారి కూడా ఆయకట్టు నిరిచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గతేడాది జూలై 27న కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరదకు ప్రధాన కట్ట తెగిపోయింది. దీంతో ప్రాజెక్టు ఖాళీ అయింది. అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సిరాల బాట పట్టారు. అక్కడి వారిని కలిసి రైతులను ఓదార్చారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అప్పటి కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు, వేణుగోపాలచారి బాధిత రైలును ఓదార్చారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారింది. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ జనవరిలోనే ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిరాల ప్రాజెక్టును త్వరగా పునర్నిర్మించి వానాకాలంలో ఆయకట్టు రైతులకు సాగునీరందించాలని సూచించారు.అధికారులు ప్రాజెక్టు కట్ట నిర్మాణంతోపాటు ఇతర పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రాజెక్టుకు రూ.12.36 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. మరో 20 రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. ఈ సమయంలో పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియడంలేదు.

గతేడాది భారీ వర్షాలతో...
గతేడాది కురిసిన భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు ప్రధాన ఆయకట్టు తెగి నీరంతా ఖాళీ అయ్యింది. గత జూలై 27న కట్ట పైనుంచి నీరు కిందికి రావడంతో గమనించిన గ్రామస్తులు పక్కనే ఉన్న మహాదేవ్ ఆలయానికిచేరుకున్నారు. పిల్లాపాపలతో ఊరంతా ఆలయంపైనే జాగరణచేశారు. సాయంత్రం దేవుని మందిరానికి అంతాచేరుకునేలోపే ప్రధాన తూము వద్ద కొంత భాగం గండిపడి నీటి శబ్దంవచ్చింది. మరో గంటకు కట్టపై ఉన్న రామస్వామి ఆలయం వద్ద ఇంకో గండి పడింది. అంతా చూస్తుండగానే రామస్వామి ఆలయం నీటిలోకొట్టుకుపోయింది. మరో గంటసేపటికి పాత తూము ప్రాంతం పెద్ద మొత్తంలోనే గండిపడింది. చూస్తుండగానే నీరంతా సిరాల చుట్టు ప్రవహిస్తూ పంటపొలాల్లోకి వెళ్లిపోయింది. ఎటుచూసిన నీరే కనిపించింది.

ఊళ్లోకి వరద వచ్చే అవకాశం..
సిరాలవాసుల్లో మళ్లీ భయం కనిపిస్తుంది. ఈయేడు కూడా మళ్లీ వర్షాలు కురిస్తే గతంలో ప్రాజెక్టులోకి వచ్చే వరద నీరంతా నేరుగా గ్రామాన్ని ముంచెత్తుతుందని ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే మహారాష్ట్ర నుంచి సిరాల ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. కట్ట లేని కారణంగా వచ్చిన నీరు వచ్చినట్లే గ్రామంలోకి వెళ్లి పక్కనే ఉన్న పంటపొలాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. ప్రాజెక్టు తెగడంతో ఇప్పటికే సిరాల ఆయకట్టు రైతులు రెండు పంటలు నష్టపోయారు.

అంతా బండరాళ్లే...
గతేడాది సిరాల ప్రాజెక్టు తెగిపోవడంతో పంట భూముల్లో పెద్ద పెద్ద బండరాళ్లు, ఇసుకమేటలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. సిరాల, ఇలేగాం, దేగాం, వాలేగాం, కామోల్ వరకు ఈ ప్రాజెక్టు నీటిలో 800 ఎకరాల భూములు నీటమునిగాయి. 300 ఎకరాలు పూర్తిగా బండరాళ్లు, ఇసుకమేటలు వెలిశాయి. నీటమునిగిన పంటలకు ఇప్పటికీ ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. నష్టపోయిన రైతుల భూములను ఇప్పటికీ బాగుచేసి ఇవ్వలేదు. ఈ ప్రాజెక్టు కింద నిర్మించిన 4 కిలోమీటర్ల మేర ఉన్న సీసీ కెనాల్ కొట్టుకుపోయింది. ప్రస్తుతం సీసీ కెనాల్ ఎక్కడికక్కడ తెగి ఉంది. వర్షాలు కురిస్తే నీరంతా సీసీ కెనాల్ కింద ఉండే పంటభూములను ముంచెత్తనుంది.

త్వరలో పనులు ప్రారంభం..
గతేడాది భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు ప్రధానకట్ట, తూము కొట్టుకుపోయింది. ప్రాజెక్టులో ఉన్న నీరంతా ఖాళీ అయ్యింది. ఆ సమయంలో ఉన్నతాధికారులు అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరిచేసింది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. సిరాల ఆయకట్టు నిర్మాణం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.
– అనిల్, ఇరిగేషన్ డీఈ

కనుమరుగైన చరిత్ర....
1902లో సిరాల ప్రాజెక్టు నిర్మించారు. 121 ఏళ్ల కింద నిర్మించిన ఈ చెరువు ప్రధాన కట్టపైనే రామస్వామి ఆలయం ఉంది. సిరాల ప్రాజెక్టు అప్పట్లో అతి తక్కువ ఖర్చుతో రెండు గుట్టల మధ్య నిర్మించారు. ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు మాత్రమే ఈ ప్రాజెక్టు ఎండిపోయింది. ఎప్పుడు నీటితో ఉండే ఈ ప్రాజెక్టు కింద అప్పట్లో ఏడు గ్రామాల్లోని 4 వేల ఎకరాలకు నీరందేది. ప్రాజెక్టులో పూడిక పేరుకుపోవడంతో ప్రస్తుతం 1,400 ఎకరాలకే నీటిని అందిస్తుంది. 121 ఏళ్ల ఈ ప్రాజెక్టు గతేడాది భారీ వర్షాలకు పూర్తిగా కనుమరుగైపోయింది.

క్లుప్తంగా

జనారణ్యంలోకి జింకపిల్ల



రోడ్డు దాటుతున్న జింకపిల్ల

సారంగాపూర్: మండలంలోని జామ్ పెద్దూర్ పక్కనే ఉన్న క్రికెట్ మైదానంలోకి శుక్రవారం జింకపిల్ల వచ్చింది. అక్కడ క్రికెట్ ఆడుతున్న యువకులను చూసి మళ్లీ వెనక్కి వెళ్లింది. దాదాపు 20ఫీట్ల దూరం వరకు గెంతి క్షణాల్లో పంటపొలాల్లోకి వెళ్లిపోయింది. క్రికెట్ ఆడుతున్న యువకులంతా జింకను తమ సెల్ ఫోన్లతో ఫొటోలు తీశారు.

హుండీ దొంగిలించిన వ్యక్తికి రెండు నెలల జైలు

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలోగల అయ్యప్ప ఆలయంలో హుండీ దొంగిలించిన వ్యక్తికి శుక్రవారం జిల్లా కోర్టు రెండు నెలల జైలుశిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వాట్ తాలూకా మండవ గ్రామానికి చెందిన దొడివార్ రాజేశ్వర్ మార్చి 25వ తేదీన మండలంలో సుంకిడి గ్రామంలో అయ్యప్ప ఆలయంలో హుండీ చోరీకి పాల్పడ్డాడు. ఎస్సై దనశ్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడైన రాజేశ్వర్‌ను పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. శుక్రవారం జిల్లా కోర్టులో దొంగతనానికి పాల్పడిన రాజేశ్వర్‌కు రెండునెలల జైలు శిక్ష విధించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సోన్: మండలంలోని న్యూవెల్మల్ శివారులో గల మామిడి తోటలో శుక్రవారం పేకాడుతున్న 11మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వారి నుంచి రూ.53,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పే ర్కొన్నారు. ఇదే టీం సాయంత్రం 5గంటలకు బొప్పారం శివారులో ఎనిమిదిమంది పేకాటరాయుళ్లను పట్టుకుని వారి నుంచి రూ. 12వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని డీఎస్పీ గంగారెడ్డి, సీఐ నవీన్ అభినందించారు.

గుడుంబా పట్టివేత

బోథ్: మండలంలోని ధన్నూర్ కే గ్రామంలో శుక్రవారం గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ధన్నూర్ కే గ్రామంలో గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్న రాథోడ్ భీంరావ్, జాదవ్ విజయలక్ష్మిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



చిన్నరాములు (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కొరింశెట్టి చిన్నరాములు (ఎర్రన్న) (58) శుక్రవారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబీకులు 108లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే చిన్నరాములు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. చిన్నరాములు ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

గుండేగాం కష్టం తీరేదెప్పుడో!

- పునరావాసం కోసం ఎదురుచూపులు
- 20 రోజుల్లో వానాకాలం ప్రారంభం
- ఏటా గ్రామస్తులకు తప్పనితిప్పలు
- ఈ ఏడాదైనా ముంపుముప్పు తప్పేనా?



గ్రామంలోకి వచ్చిన బ్యాక్‌వాటర్ (ఫైల్)



గ్రామం	: గుండేగాం
కుటుంబాలు	: 162
పంట భూములు	: 364 ఎకరాలు

ప్రధాన సమస్య: పల్సికర్ రంగారావు ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ఊరిలోకి రావడం, ఏటా గుండేగాం నీటమునగడం

పరిష్కారం: భైంసా సమీపంలోని కమలాపూర్ గుట్టవద్ద పునరావాస గ్రామం ఏర్పాటు చేయడం

భైంసా/భైంసారూరల్: గుండేగాం ముంపు సమస్యకు పాలకులు ఇప్పటికీ పరిష్కారం చూపడం లేదు. ఏటా వానాకాలం వస్తుందంటే గ్రామస్తులు భయంతో వణికిపోవాల్సిన పరిస్థితులున్నాయి. ప్రతీ వానాకాలం ఈ గ్రామానికి గండంగా మారుతోంది. వర్షాలు కురియడం.. నీరంతా గ్రామంలోకి రావడం ఆనవాయితీగా వస్తోంది. భారీ వర్షాలు కురిస్తే గ్రామస్తులు అదే నీటిలో ఉంటున్నారు. ఈ గ్రామ ముంపు సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. పునరావాసం కల్పిస్తామంటూనే ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రభుత్వాలు మారినా గుండేగాం రాత మారడంలేదు. పాలకులు ఎవరు వచ్చినా గుండేగాం సమస్య పరిష్కారం కావడం లేదు. అధికారులు పునరావాసం త్వరలోనే అంటూ ప్రకటనలు ఇస్తున్నారే గాని ఆచరణలో చూపడం లేదు. ఈ వేసవిలో అప్పుడప్పుడు కురిసిన వర్షాలకే గుండేగాంవాసులు అల్లాడుతున్నారు. మరో 20 రోజుల్లో వర్షాకాలం ప్రారంభమైతే ఈ గ్రామస్తుల పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు.

ప్రాజెక్ట్ నిర్మాణంతో..

పల్సికర్ రంగారావు ప్రాజెక్ట్ నిర్మాణంతో ప్రతీ వానాకాలంలో గుండేగాం గ్రామం పూర్తిగా నీటమునుగుతోంది. గత కొన్నేళ్లుగా గ్రామంలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో ఊరు మునగదని గ్రామస్తులకు భరోసా కల్పించారు. కట్ట నిర్మాణం పూర్తయితే వానాకాలంలో తప్పనిసరిగా నీరువస్తుందని గుండేగాం గ్రామస్తులు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. గతేడాది భారీ వర్షాలు కురిసిన సమయంలో ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ గుండేగాంను నీటముంచింది. ఫలితంగా గ్రామస్తులంతా ఇబ్బందులు పడ్డారు. వాగు పరీవాహక ప్రాంతాల్లో నివాసముంటున్నవారు కట్టుబట్టలతో బయటకు వచ్చారు. ఈ ఏడాది పునరావాసం కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేర్చలేదు.

పునరావాస కేంద్రంలోనే..

గతేడాది వానాకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోనే కాలం వెల్లదీశారు. ఈ ఏడాది ఎలాగైనా పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలోని అప్పటి మంత్రులు జోగు రామన్న, అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి గ్రామానికి వచ్చి పరిస్థితిని చూశారు. అప్పటి ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి గ్రామస్తులు గత ప్రభుత్వంలోని అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దగ్గరికి వెళ్లారు. గుండేగాం సమస్య పరిష్కారం కోసం గత ప్రభుత్వంలోనూ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అసెంబ్లీలో ప్రశ్నించారు. అప్పటి సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించినప్పటికీ పునరావాసం ఎక్కడ కల్పిస్తారన్న సమస్య అలాగే ఉండిపోయింది. రాష్ట్రంలో ఐదునెలల క్రితం కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ గుండేగాం విషయమై అసెంబ్లీలో మాట్లాడారు. అధికారులతో సమీక్షించారు. కానీ.. వానాకాలం సమీపిస్తున్నా గుండేగాం పునరావాసం విషయంలో ఒక్క అడుగు ముందుకు పడడం లేదు. ఈ ఏడాది కూడా పునరావాసం కల్పిస్తారన్న నమ్మకం కనిపించడంలేదు.

తాత్కాలికంగా..

గుండేగాం నీట మునగడంతో గ్రామస్తులు తాత్కాలికంగా కమలాపూర్ గుట్ట సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లలో నివసిస్తున్నారు. గుండేగాం గ్రామానికి చెందిన 81 కుటుంబాలవారు ఇందులోనే నివసిస్తున్నారు. గుండేగాం సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో తెలియక అంతా అయోమయానికి లోనవుతున్నారు. వర్షాలు కురిస్తే మళ్లీ బ్యాక్ వాటర్ ఊరిలోకి వచ్చి ఇండ్లు మునుగుతాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో ప్రభుత్వం ప్రకటన చేయకపోవడం, అందుకు తగ్గట్లు స్థలం కేటాయించకపోవడంపై ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వానాకాలంలో నీటమునిగే గుండేగాం గ్రామానికి పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉంది.



డబుల్‌బెడ్‌రూం ఇండ్లు

సమస్య పరిష్కరిస్తాం

గుండేగాం గ్రామంలో మళ్లీ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలా ఆలోచిస్తున్నాం. ఇప్పటికే అసెంబ్లీలో గుండేగాం విషయాన్ని ప్రస్తావించాను. అధికారులతోనూ సమీక్ష నిర్వహించాం. ఈ వానాకాలంలో గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాను. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే సమస్య తలెత్తింది. తొమ్మిదేళ్లుగా గత ప్రభుత్వం గుండేగాం గ్రామస్తుల సమస్య పట్టించుకోలేదు. ఈఏడాది సమస్య పరిష్కారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తాం.

– పవార్ రామారావుపటేల్, ముధోల్ ఎమ్మెల్యే

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని గోండ్‌గూడ గ్రామంలో ఉరేసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబీకులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని కొబ్బయ్‌గూడ గ్రామానికి చెందిన పెందోర్ భీంరావ్, ఇంద్రబాయి దంపతుల కూతురు సుమిత్ర (26) నాలుగు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కుటుంబీకులు పలు ఆస్పత్రుల్లో చూపించినా నొప్పి తగ్గలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గోండ్‌గూడ గ్రామంలో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వచ్చిన సుమిత్ర కడుపు నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన బంధువులు సుమిత్ర తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తండ్రి భీంరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిలాబాద్‌లో కౌఠ యువకుడి మృతి



రత్నాకర్‌మృతదేహం

బోథ్: మండలంలోని కౌఠ బీ గ్రామానికి చెందిన రత్నాకర్(24) ఆదిలాబాద్‌లో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. వివరాలు.. రత్నాకర్ ఆదిలాబాద్‌లోని తన అత్తగారింటి వద్ద ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. శుక్రవారం మేస్త్రీ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రత్నాకర్ మృతితో అతడి సొంతూరైన కౌఠ బీ గ్రామంలో విషాదం నెలకొంది.

నాణ్యమైన బోధనకు ఆదర్శం



కుంటాలలోని మోడల్ స్కూల్, కళాశాల

- ఉమ్మడి జిల్లాలో 14 పాఠశాలలు
- ఇంటర్ ఫస్టియర్‌లో 2,240 సీట్లు
- ఈ నెల 25వరకు దరఖాస్తుల స్వీకరణ

కుంటాల: గ్రామీణ ప్రాంతాల్లోని పేదవిద్యార్థులకు ఆంగ్ల మాధ్యమాన్ని అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూళ్లు) ఏర్పాటు చేశాయి. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 14 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటయ్యాయి. వీటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇటీవల పదోతరగతి ఫలితాలు వెలువడ్డాయి. 14 ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్‌లో 2,240 సీట్లున్నాయి. ఇందులో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 25వ తేదీ వరకు ఆయా పాఠశాలలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. ఈనెల 26న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రదర్శిస్తాయి. ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు విద్యార్థుల నిజ ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తారు. ఇంటర్‌లో ప్రవేశం పొందిన బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి కల్పిస్తారు.

ప్రవేశాలకు పోటీ పెరిగింది



ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులు ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడంతో పోటీ పెరిగింది. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశం పేద విద్యార్థులకు వరం. సకాలంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.

– శ్రీనివాస్ ప్రసాద్, ప్రిన్సిపాల్, కుంటాల

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్, బోథ్, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, జైనథ్, నార్నూర్, సిర్పూర్, ఆసిఫాబాద్, కోటపల్లి, దండేపల్లి, లింగాపూర్, కాసిపేట, మంచిర్యాల, కుంటాలలో మోడల్ స్కూళ్లున్నాయి. వీటిలో ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 2,240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీలకు 29 శాతం, దివ్యాంగులకు 3శాతం, ఓసీలకు 36శాతం, ఈడబ్ల్యూఎస్‌కు10శాతం, బాలికలకు 33.33 శాతం సీట్లు కేటాయించారు.

విద్యుదాఘాతంతో మల్టీపర్పస్ వర్కర్ మృతి

ఆదిలాబాద్‌రూరల్: లింగుగూడ గ్రామపంచాయతీకి చెందిన మల్టీపర్పస్ వర్కర్ పూసం ఉద్ధవ్ (35) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగుగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ధర్‌లొద్ది గ్రామంలో ఉద్ధవ్ వీధి దీపాలు అమరుస్తున్నాడు. ఈక్రమంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ స్తంభం పైనుంచి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సునీత తెలిపారు. ఉద్ధవ్‌కు భార్య రుక్మాబాయి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాయినగర్‌లో తాపీమేస్త్రీ..

మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్‌లో భవన నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై బిక్క రత్నాకర్ (24) అనే మేస్త్రీ శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌లో భవన నిర్మాణ పనులు చేసే క్రమంలో ఇనుప రాడ్‌ను సరిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో రత్నాకర్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

ఇష్టం లేని పెళ్లి చేశారని యువకుడి ఆత్మహత్య



ఉమేశ్ (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): ఇష్టం లేని వివాహం జరిపించారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పెళ్లై నెల కాకుండానే ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన వడ్డె ఉమేశ్ (27)కు ఈనెల 5న సుర్దాపూర్ గ్రామానికి చెందిన లెండ్గురె పోశెట్టి కూతురితో వివాహం జరిపించారు. కాగా, కుటుంబ సభ్యులు గురువారం నవదంపతులకు కార్యం ఏర్పాటు చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉమేశ్ అదేరోజు మధ్యాహ్నం ఇంట్లోని కూలర్ మోటరు మరమ్మతు కోసం ద్విచక్ర వాహనంపై ఆసిఫాబాద్ వెళ్లాడు. కొద్ది సేపటికే తండ్రి బాపురావుకు ఫోన్ చేసి తాను వంకాయ తోటలో ఉన్నానని, బీరు (మద్యం)లో పురుగుల మందు కలిపి తాగినట్లు తెలిపాడు. దీంతో హుటాహుటిన ఉమేశ్ తండ్రి వారి వంకాయ తోటకు వెళ్లి చెట్టు కింద నీరసంగా కూర్చున్న కుమారుడిని ఎందుకిలా చేశావని అడిగాడు. తనకు ఇష్టం లేని వివాహం జరిపించడంతో పురుగుల మందు తాగినట్లు ఉమేశ్ తెలిపాడు. వెంటనే గ్రామస్తుల సాయంతో ఉమేశ్‌ను ఆసిఫాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి బాపురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన ముగ్గురిపై కేసు

వాంకిడి: కర్రతో దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం లెండిగూడ గ్రామానికి చెందిన గుర్నులె సోమకు ఇద్దరు కుమారులు నాందేవ్, మనోహర్ ఉన్నారు. సోమ ఏడాది క్రితం మృతి చెందగా అతడి పేరిట ఉన్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని ఇద్దరు సమంగా సాగు చేసుకుంటున్నారు. అయితే తల్లి బాగోగులు చిన్న కుమారుడు మనోహర్ చూసుకుంటున్నందున వాటాలో ఐదు మూరలు అధికంగా తమ్ముడు సాగు చేసుకునేందుకు నాందేవ్ అంగీకరించాడు. ఈ క్రమంలో గురువారం తమ్ముడి ఇంటికి వెళ్లిన నాందేవ్.. తల్లికి జ్వరం వస్తున్నా ఆస్పత్రిలో ఎందుకు చూపించడం లేదని అడిగాడు. దీంతో ఆవేశానికి గురైన మనోహర్ 'భూమి పంచుకుందాం అంటే పట్టించుకోకుండా ఎందుకు మాట్లాడుతున్నావు' అని బూతులు తిడుతూ కర్రతో అన్న తలపై కొట్టాడు. పక్కనే ఉన్న మనోహర్ భార్య తానుబాయి, కుమారుడు శ్రీకాంత్ కూడా నాందేవ్‌పై దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు వారిని విడిపించడంతో గొడవ సద్దుమణిగింది. నాందేవ్ తలపై రక్తపు గాయాలు కాగా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. శుక్రవారం నాందేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిలిచి ఉన్న వాహనాన్ని ఢీకొట్టి ఒకరు మృతి

భైంసారూరల్: కుంటాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన ర్యాపాని గణేశ్ (44) నిలిచి ఉన్న వాహనానికి ఢీకొట్టుకుని మృతిచెందాడు. వివరాలు.. గురువారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై రెండు ఐచర్‌వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే కల్లూరు గ్రామానికి చెందిన ర్యాపాని గణేశ్ ద్విచక్రవాహనంపై భైంసాకు వెళ్తున్నాడు. నిలిచి ఉన్న ఐచర్‌వాహనానికి ఢీకొట్టుకుని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధి దేవాపూర్ చెక్‌పోస్ట్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అజీమ్ అహ్మద్ (31) మృతి చెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని దహెగాం గ్రామానికి చెందిన అజీమ్ అహ్మద్ మహారాష్ట్రలోని గఢ్‌చందూర్ నుంచి కిన్వట్‌కు వయా బోథ్ మీదుగా లారీ తీసుకుని వెళ్తున్నాడు. మార్గమధ్యలో దేవాపూర్ చెక్‌పోస్ట్ సమీపంలో జాతీయ రహదారి 44పై లారీ పార్కింగ్ చేసి ఉంది. ఎలాంటి పార్కింగ్ లైట్లు వేయకపోవడంతో ఆయన ఎదురుగా ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అజీమ్ అహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు అబ్దుల్ అజీజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టేకుచెట్లు నరికిన వ్యక్తి అరెస్ట్



కోర్టు ప్రాంగణంలో నిందితుడితో ఫారెస్ట్ సిబ్బంది

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ పరిధిలో టేకుచెట్లు, అడవిలోని పొదలు నరికిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎఫ్‌వో, ఇన్‌చార్జి ఎఫ్‌డీవో శివ్‌ఆశిస్‌సింగ్ శుక్రవారం తెలిపారు. తాళ్లపేట్ రేంజ్‌లోని తపాలపూర్ బీట్ కంపార్ట్‌మెంట్ నంబర్ 342లో టేకుచెట్లతో పాటు అక్రమంగా పొదలు నరికినందుకు ఆత్రం చిన్నరాజంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. లక్సెట్టిపేట కోర్టు న్యాయమూర్తి నిందితుడికి 14రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

ఆసిఫాబాద్‌రూరల్: ప్రియుడితో కలిసి భర్తను భార్య చంపిన ఘటన రహపల్లిలో చోటు చేసుకుంది. మృతుడి అన్న ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం.. తన తమ్ముడు చునార్కర్ రవీందర్ (38) భార్య కళావతి గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్‌తో తరచూ ఫోన్‌లో మాట్లాడేదని ఆనందరావు తెలిపాడు. దీంతో ఇంట్లో గొడవలు పెరిగాయని పేర్కొన్నాడు. గతంలో ఈ విషయమై పంచాయితీ కూడా జరిగినట్లు తెలిపాడు. దీనిపై గురువారం కూడా గొడవ జరిగిందని పేర్కొన్నాడు. ఈక్రమంలో తన తమ్ముడు రవీందర్‌ను ప్రియుడితో కలిసి కళావతి ఇంట్లో ఉరేసి చంపిందని వివరించాడు. కళావతి, రవీందర్‌పై ఆనందరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరు మృతి

పెంబి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరు మృతి చెందారు. ఖానాపూర్ మండలం అడవి సారంగాపూర్ పరిధిలోని రాజులమడుగు గ్రామానికి చెందిన సీడం సోనేరావు (56) శుక్రవారం పెంబిలో వారసంతకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో సబ్‌స్టేషన్ ప్రాంతంలోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ముఖానికి తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాధాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

పని ఒత్తిడికి ఇంజినీర్ బలి!



కిరీటి (ఫైల్)

జైపూర్: జైపూర్ సింగరేణి పవర్ ప్లాంట్‌లో ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బూరుగడ్డ కిరీటి (37) అనే సింగరేణి ఉద్యోగి తన క్వార్టర్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని టీచర్స్ కాలనీకి చెందిన కిరీటి ప్లాంట్‌లో ఓవోఅండ్‌ఎం (బాయిలర్లలో విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణకు సంబంధించిన) డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ సెక్షన్ ఇంజినీర్ (ఎస్‌ఈ)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు ప్లాంట్‌లో క్వార్టర్ కేటాయించగా భార్య శృతి, మూడేళ్ల కుమారుడు క్రితిక్‌తో కలిసి నివాసముంటున్నాడు. శృతి వేసవి సెలవుల్లో కుమారుడితో పుట్టింటికి వెళ్లింది. కిరీటి గురువారం ఉదయం గోదావరిఖనిలో తన ఇంటి నుంచి పవర్‌ప్లాంట్‌కు డ్యూటీకి వచ్చాడు. శుక్రవారం కూడా విధులకు హాజరై మధ్యాహ్నం భోజన సమయంలో క్వార్టర్‌కు వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా సాయంత్రం విషయం వెలుగులోకి వచ్చింది. ఒంటరిగా క్వార్టర్‌లో ఉన్న కిరీటి ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కిరీటి తల్లిదండ్రులు అన్నపూర్ణ–రఘురామచారి అధికారుల పని ఒత్తిళ్లతోనే తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. తోటి ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉండే కిరీటి హఠాత్తుగా ఆత్మహత్యకు పాల్పడగా అంతా కన్నీరు పెట్టుకున్నారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కాగా, ఫ్యామిలీకి సమయం ఇవ్వలేక, పని ఒత్తిడి తట్టుకోలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కిరీటి సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన నెల్కి రామయ్యకు చెందిన రెండు గేదెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో మేతకు వెళ్లిన గేదెలు విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైర్‌ను తాకగా ప్రమాదవశాత్తు షాక్‌తో రెండు గేదెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు.



లక్సెట్టిపేట: మృతి చెందిన గేదెలు

కన్నెపల్లిలో దున్నపోతు..

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లికి చెందిన అక్కల మల్లేశ్ ముర్రాజాతి దున్నపోతు శుక్రవారం విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందింది. రోడ్డుపక్కన మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌తో మృత్యువాత పడింది. దీని విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.